సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



అన్నింటా 'ఆదర్శం'

జి.సిగడాం మోడల్ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడి ఏడుగురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. - 8లో



రీ సర్వేపై ప్రత్యేక దృష్టి

అన్ని మండలాల అధికారులతో జేసీ నవీన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. - 8లో

7 నుంచి ఏసయ్య విమోచన పండగలు

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 7 నుంచి మూడు రోజుల పాటు బాపూజీ కళామందిర్‌లో 6వ ఏసయ్య విమోచన పండగలు ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ చల్లా కరుణాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో బిషప్ పి.నటరాజన్ లాజరస్, పాస్టర్ ఎస్.బి. వరప్రసాద్, పాస్టర్ ఎస్.జోసెఫ్ ఎడ్వర్డ్, పాస్టర్ ఎన్.అబ్రహాంలు పాల్గొని దైవ సందేశాలు అందిస్తారని అందరూ తప్పక పాల్గొనాలని కోరారు.

న్యూస్‌రీల్

స్కిల్‌హబ్ సెంటర్‌లో ఉపాధి శిక్షణ కోర్సులకు ఎంపికలు

టెక్కలి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఉపాధి కోర్సులకు సంబంధించి మంగళవారం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, స్కిల్ హబ్ సెంటర్ కోఆర్డినేటర్ రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో భాగంగా 8వ తరగతి ఆ పైన చదువుకున్న అభ్యర్థులకు 3 నెలల శిక్షణకు సంబంధించి 'ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండీషన్ కోర్సు'తో పాటు ఇంటర్ ఆపైన చదువుకున్న అభ్యర్థులకు 3 నెలల శిక్షణతో 'ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్' హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రెండు కోర్సులకు సంబంధించి అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9493290012 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

10 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



నిమ్మాడలో పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్సు అధికారులు

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడకు చెందిన కోట్ని రామారావు ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 10 టన్నుల 265 కిలోల పీడీఎస్ బియ్యంను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో అధికారులు సోమవారం రాత్రి దాడి చేసి ఈ అక్రమ నిల్వలను గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.3,90,070 ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం ఈ బియ్యాన్ని కోటబొమ్మాళి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించి, కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుకు 14న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

అరసవల్లి: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఒక మెడికల్ ఆఫీసర్ (ఏఆర్‌టీ) పోస్టుకు ఈనెల 14న స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా టీబీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ ఎన్. అనూరాధ ప్రకటనలో తెలిపారు. ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న గరిష్టంగా 65 ఏళ్ల లోపున్న అభ్యర్థులు ఈ ఉద్యోగానికి అర్హులని మరిన్ని వివరాలకు స్థానిక కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని, వాక్ ఇన్ ఇంటర్వ్యూను ఈనెల 14న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తామని ప్రకటించారు.

13న అటవీ జీడి తోటల వేలం

అరసవల్లి: జిల్లా అటవీ శాఖ పరిధిలో ఇంకా మిగిలి ఉన్న 23 జీడితోటల యూనిట్లకు ఈనెల 13న వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి నిషాకుమారి తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు రేంజ్‌ల పరిధిలోని 28 యూనిట్ల జీడితోటలకు గత నెల 31న వేలం నిర్వహించినప్పటికీ..అందులో శ్రీకాకుళం రేంజ్ పరిధిలో 3 యూనిట్లు, కాశీబుగ్గ రేంజ్ పరిధిలోని 2 యూనిట్లకు మాత్రమే వేలం ఖరారైందని, మిగిలిన 23 యూనిట్లకు మళ్లీ వేలం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. పాతపట్నం రేంజ్ పరిధిలో 5 యూనిట్లు, టెక్కలి రేంజ్‌లో 9, కాశీబుగ్గ రేంజ్ పరిధిలో 2 , శ్రీకాకుళం రేంజ్ పరిధిలో 7 యూనిట్లలో ఈనెల 13న జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయ ఆవరణలోనే వేలం ప్రక్రియ నిర్వహిస్తామని డీఎఫ్‌ఓ నిషాకుమారి తెలియజేశారు.

పరస్పర ఫిర్యాదులే సాక్ష్యం

పచ్చ బ్యాచ్ కబ్జాల పర్వం

- భూదందాలను బట్టబయలు చేస్తున్న టీడీపీ కుమ్ములాటలు
- గతంలో చౌదరి బాబ్జీ ఆక్రమణపై సంధ్య కంప్లైంట్
- ప్రతిగా ఇప్పుడు ఆమెపై ఫిర్యాదు
- వీరిద్దరు కింజరాపు, కళా వర్గీయులు కావడం విశేషం



ఎస్.ఎం.పురంలో అమ్మకాలకు పెట్టిన కొండపోరంబోకు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అధికారంలో లేకపోయినా టీడీపీ నేతల భూదందా ఆగడం లేదు. మొన్నటికి మొన్న టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ) భూ బాగోతం బయటపడగా, ఇప్పుడు టీడీపీ విజయనగరం పార్లమెంట్ అధికార ప్రతినిధి గంటా సంధ్య గజపతిరావు వ్యవహారం వెలుగు చూసింది. విచిత్రమేమిటంటే ఈ రెండు భూ పర్వాలు తోటి టీడీపీ నేతల ఫిర్యాదులతోనే బట్టబయలయ్యాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎం పురం పరిధిలోని భూ ఆక్రమణలన్నీ ఒక్కొక్కటిగా ప్రపంచానికి తెలుస్తున్నాయి.

విక్రయాలకు ఒప్పందం

ఎస్ఎంపురంలో సర్వే నంబర్ 112లో 49 సెంట్ల కొండ పోరంబోకు భూమి ఉంది. ఇప్పుడా భూమి తన తాత సంపతిరావు సత్యనారాయణకు చెందినదిగా చూపిస్తూ వేర్వేరు సర్వే నంబర్లపై టీడీపీ విజయనగరం పార్లమెంట్ అధికార ప్రతినిధి గంటా సంధ్య గజపతిరావు అమ్మకాలకు పెట్టారు. తన తాత నుంచి తల్లి విజయకి, పిన్నమ్మలకు వచ్చిందని, వారంతా ఇప్పుడు అమ్మకానికి పెట్టారని చెబుతూ సంధ్య గజపతిరావు అమ్మకాలు సాగిస్తున్నారు. సెంటు రూ.48వేలకు విక్రయించేందుకు పలువురితో ఒప్పందం కూడా చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకుని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ) నేరుగా ఎచ్చెర్ల తహసీల్దార్ టి. సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వేయర్ తమ్మయ్య స్వామి, రెవెన్యూ అధికారులు ఆ భూమి పైకి వెళ్లి సర్వే చేశారు. ఆ భూమి పూర్తిగా కొండపోరంబోకు భూమిగా తేల్చారు.

టీడీపీలో ఆసక్తికర పోరు

ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీలో ఆసక్తికర పోరు నడుస్తోంది. 2014 నుంచి 2019 వరకు టీడీపీ నాయకులు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా భూ ఆక్రమణలు చేశారు. అధికారం చేతిలో ఉందని, అధికారులను గుప్పెట్లో పెట్టుకుని రికార్డులను మార్చేశారు. తమకు కావాల్సిన భూమిపై, తమకు కావాల్సిన పేర్లను రికార్డుల్లోకి ఎక్కించారు. అధికారం దిగిపోయాక అక్రమాలన్నీ బయటికొస్తున్నాయి. ఎచ్చెర్ల పంచాయ తీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఎస్ఎంపురం వెళ్లే దారిలో ఉన్న కృష్ణ బంద చెరువును ఆక్రమించి, రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారని టీడీపీ విజయనగరం పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి గంటా సంధ్య గజపతిరావు ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురంలో సర్వే నంబరు 112లో ఉన్న కొండలో కొంత భాగాన్ని కూడా సబ్ డివిజన్‌గా చేసినట్టుగా చూపించి, సర్వే నంబర్ 638లో 4.35 ఎకరాల మేర టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి బాబ్జీ(చౌదరి బాబ్జీ) అక్రమంగా పట్టా సంపాదించారని కూడా ఫిర్యాదు చేశారు. ఈ రెండింటి పైన అధికారులు విచారణ చేశారు. 3.11 ఎకరాల భూమి అంతా పూర్తిగా చెరువు గర్భమని గుర్తించి, రికార్డుల నుంచి చౌదరి బాబ్జీ పేరు తొలగించారు. అదే విధంగా సర్వే నంబర్ 638లో గల 4.35 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను ఫేక్‌గా గుర్తించారు. ఇప్పుడిది జేసీ కోర్టులో నడుస్తోంది. తనను లాగితే ఊరుకుంటానా.. అని ఇప్పుడు గంటా సంధ్య గజపతిరావు జోలికి చౌదరి బాబ్జీ వెళ్లారు. ఆమెకు సంబంధించిన అక్రమాలను బయటపెడుతున్నారు. అందులో భాగంగానే సర్వే నంబర్ 112లో గల 49సెంట్ల భూమి అమ్మకాలపై ఫిర్యాదు చేశారు. మొత్తానికి ఇరువర్గాల ఫిర్యాదులతో ఎచ్చెర్ల మండలంలో టీడీపీ హయాంలో జరిగిన భూ ఆక్రమణలు, భూదందాలు బయటకు వస్తున్నాయి. ఇక్కడ చౌదరి బాబ్జీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వర్గంగా కొనసాగుతుండగా, గంటా సంధ్య గజపతిరావు.. అచ్చెన్నాయుడుకు పార్టీ అంతర్గత ప్రత్యర్థి అయిన, కళా వెంకటరావుకు అనుచరురాలిగా కొనసాగుతున్నారు. వీరి మధ్య నడుస్తున్న పోరులో భూ బాగోతాలు వెలుగు చూస్తున్నాయి.



సంధ్య గజపతిరావు, చౌదరి బాబ్జీల సమక్షంలో భూమి స్వరూపాన్ని వివరించిన రెవెన్యూ ఉద్యోగులు

పాపం.. ట్రాకర్..!

- ఎలిఫెంట్ ట్రాకర్‌ను తొక్కి చంపేసిన ఏనుగులు
- మన్యం జిల్లా భామిని మండలంలో ప్రమాదం
- మృతుడిది పాతపట్నం మండలం సవర తిడ్డిమి



ట్రాకర్ లక్ష్మీనారాయణ మృత దేహాన్ని పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

పాతపట్నం/భామిని: మరికొద్ది రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు ఏనుగుల దాడిలో మరణించాడు. ఒక రోజు ముందు వరకు అమ్మానాన్నలతో సరదాగా గడిపిన కుర్రాడు రోజు తిరిగే సరికి ప్రాణాలు కోల్పోయాడు. భామిని మండలం పసకుడిలో సోమవారం ఏనుగుల దాడిలో పాతపట్నం మండలం సవర తిడ్డిమికి చెందిన లోకొండ లక్ష్మీనారాయణ(25) మృతి చెందాడు.

ఘటన ఇలా...

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని తివ్వాకొండలపైకి చేరిన ఐదు ఏనుగుల గుంపు ఇటీవల మళ్లీ కొండ దిగాయి. మూడు రోజుల కిందట వీటి నుంచి హరి అనే ఏనుగు విడిపోయింది. నాలుగు గజరాజులు మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతంలో సంచరిస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు గగ్గోలు పెడుతుండడంతో తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో ట్రాకర్ లోకొండ లక్ష్మీనారాయణ(25)తో పాటు గ్రామస్తులు పలువురు కాగడాలతో ఏనుగులు సంచరిస్తున్న పసక్కుడి పొలిమేరల్లోకి చేరుకున్నారు. వాటిని కొండలవైపు మళ్లిస్తుండగా... ఏనుగులు తిరగబడ్డాయి. ఆ క్రమంలో అందరూ పరుగు తీశారు. లక్ష్మీనారాయణ కాలుజారి కిందపడడంతో ఏనుగులు తొండంతో విసిరికొట్టాయి. కాళ్లతో ముఖంపై తొక్కి చంపాయి. ఓ గంట సమయం పాటు ఘటనా స్థలం వద్దే తిష్టవేశాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం వచ్చినా ఫలితం లేకపోయింది. గ్రామస్తులందరూ ఏకమై ఏనుగులను అదిలించడంతో కొద్దిదూరం వెళ్లాయి. ఘటనా స్థలానికి అటవీ, పోలీస్ అధికారులు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి తండ్రి లోకొండ సింహాచలం, తల్లి అప్పలమ్మ ఉన్నారు. అన్నయ్య శ్యామ్‌కుమార్ కుటుంబంతో కలిసి శ్రీకాకుళంలో నివసిస్తున్నాడు. లక్ష్మీనారాయణ రెండు రోజుల కిందటే స్వగ్రామానికి వచ్చి సోమవారమే తిరిగి వెళ్లాడు. ఇటీవలే పెళ్లి సంబంధం కూడా కుదిరింది. ఇంతలోనే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కుమిలిపోతున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రాణాలు తీసిన ఏనుగుల గుంపు



ఎన్‌సీసీ హీరోలకు అభినందనలు

దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎన్‌సీసీ క్యాడెట్లు ఎం.చంద్రశేఖర్, పి.సాయికుమార్, బి.చైతన్యకుమార్‌లను శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో సోమవారం అభినందించారు. ఉత్తరాంధ్ర నుంచి తమ కాలేజీ తరపున ముగ్గురు ఢిల్లీకి వెళ్లడం గర్వకారణమని ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ అన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ

ట్రయల్ రన్.. సూపర్ హిట్

- జిల్లాలో విజయవంతంగా 'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్
- గత ఏడాది అక్టోబర్ 21 నుంచి అమలు
- మూడు నెలల్లోనే 96,457 మందికి వైద్య సేవలు



గూడెంలో ఇంటికే పరిమితమైన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

అరసవల్లి: జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ సూపర్ హిట్టైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వినూత్న ఆలోచనకు ప్రతిరూపంగా పురుడు పోసుకున్న ఈ విధానాన్ని సిక్కోలులో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. వైద్యులు కూడా ఈ విధానంపై పూర్తి సంతృప్తి చెందుతూ ఇంటింటికీ వెళ్లి రోగులకు చికిత్స చేస్తున్నారు. సుగర్, బీపీ తదితర రోగాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను కూడా ఇస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ 'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్ ప్రారంభించారు. ఈ మూడు నెలల్లోనే 96,457 మంది వరకు రోగులు, సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ విధానం ద్వారా పరీక్షలు, మందుల పంపిణీ జరిగింది.

విధానం ఇలా..

జిల్లాలో మొత్తం 66 పీహెచ్‌సీలు ఉండగా, వీటి పరిధిలో 594 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 541 హెల్త్ క్లినిక్స్‌లో ఈ విధానంలో భాగంగా వైద్యులు ఇంటింటికీ వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 104 వాహనంతో పాటు వైద్యుడు, వైద్య సిబ్బంది గ్రామాల్లోనే సేవలు అందిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉచితంగా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పక్షవాతం, నరాల బలహీనతతో నడవలేని వారి ఇళ్లకు వైద్యులే స్వయంగా వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్న వారిని కలుసుకుని ఆరోగ్య యోగక్షేమాలను వైద్యులు, సిబ్బందే వాకబు చేస్తున్నారు.

పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు..

ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కేంద్రాల్లో 67 రకాల మందులతో పాటు 14 రకాల ర్యాపిడ్ కిట్లను వైఎస్సార్ విలేజీ క్లినిక్స్‌లో అందుబాటులో ఉంచారు. ప్రత్యేక యాప్ ద్వారా ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ అమలవుతున్న విధానాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారుగా ఒక లక్ష మందికి పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జీవనశైలి జబ్బులతో పాటు ఇతర వ్యాధులను గుర్తించేందుకు వీలుగా వైద్య పరీక్షలను చేస్తున్నారు. జిల్లా వైద్య రంగంలో ఇదో కీలక పరిణామంగా వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వైద్యులకు సంతృప్తినిస్తోంది..



ఫ్యామిలీ డాక్టర్ విధానం నిజంగా ఓ వైద్యురాలిగా ఎంతో సంతృప్తినిస్తుందని చెప్పగలను. ఇదే విషయాన్ని వైద్యులతో కూడిన సమీక్షలో చాలా మంది వైద్యులు చెప్పారు. మంచానికే పరిమితమైన మారుమూల ప్రాంతాల వారి ఇంటికి వెళ్లి సేవలందించడం అద్భుతం. ఈ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తోంది. దాదాపుగా వైద్యులు, సిబ్బంది పోస్టులన్నీ భర్తీ చేశారు. గత మూడు నెలల్లోనే సుమారుగా లక్ష మందికి సేవలందించడం అనేది నిజంగా రికార్డే. మరింతగా సేవలందించేలా గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులు పనిచేయాలని సూచిస్తున్నా.

– డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో సేవలందాయిలా...



మొత్తం ఉచిత పరీక్షలు, మందులు తీసుకున్న వారి సంఖ్య 96,457	సాధారణ ఆరోగ్య ఓపీ, మందుల పంపిణీ 58,835	కౌమార బాలికలకు పరీక్షలు 466	గర్భిణులకు యాంటీనేటల్ కేర్ పరీక్షలు 5,317
బాలింతలకు ఆరోగ్య పరీక్షలు (పీఎన్‌సీ) 3,330	నోటి క్యాన్సర్ 96	రక్తహీనత పరీక్షలు (ఎనీమియా) 349	రక్తపోటు (బీపీ) 16,641
మధుమేహం (షుగర్) 10,932	గర్భాశయ క్యాన్సర్ 90	టీబీ (క్షయ) 345	రొమ్ము క్యాన్సర్ 56

కలెక్టర్ స్పందన @ 193



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 193 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు వినతులు స్వీకరించారు. స్పందనలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

ఎస్పీ స్పందన @ 28



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: స్పందనకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 28 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ వెల్లడించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

● ఇచ్చిన మాట కోసం ఎందాకైనా..



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఒకసారి ప్రజలకు మాటిస్తే దాని కోసం ఎందాకైనా వెళ్లే కుటుంబం వైఎస్సార్ కుటుంబమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరులో ఆయన గృహ సారథులు, వలంటీర్లతో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్య, వ్యవసాయంపై అద్భుతమైన పథకాలు రూపొందించారని ప్రశంసించారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పథకాలు అందజేయడం గొప్ప విషయమని అన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే గెలిపించాలని, అప్పుడే ఈ పథకాలన్నీ సమర్థంగా కొనసాగుతాయని తెలిపారు.

–పొందూరు

● వాణిజ్య పంటలు వేయాలి



మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

రైతులకు వరితో మాత్రమే లాభాలు రావని, వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. గార మండలం సతివాడలో ఆయన సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి రావడమే రామోజీరావు లక్ష్యమని, కానీ సామాన్యుల బతుకులు మారాలంటే వైఎస్ జగనే మళ్లీ రావాలని తెలిపారు. రైతుకు పెట్టుబడి సాయం అందిస్తున్నారని, భూముల సర్వే జరుగుతోందని అన్నారు. ధరలపై కొందరు కామెంట్లు చేస్తున్నారని, అవి దేశవ్యాప్తంగా పెరుగుతున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు.–గార

● ప్రజల కోసమే..

ప్రజల కోసమే సీఎం వైఎస్ జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని పాడి, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలం గరుడఖండి పంచాయతీలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్దానంలో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ముగింపు దశకు వచ్చిందన్నారు. ఉద్దానం తాగునీటి పథకం ఏర్పాటవుతోందని తెలిపారు. ఈ ప్రభుత్వానికి అన్ని వర్గాల ఆశీస్సులు ఉండాలన్నారు.

– పలాస



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

క్లుప్తంగా

న్యాయ విద్య తక్షణ ప్రవేశాల కోసం ప్రయత్నం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని న్యాయ విద్య (ఎల్ఎల్బీ) తక్షణ ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2008లో వర్సిటీ ఏర్పడినా, ఏయూ పీజీ కేంద్రంగా న్యాయ కళాశాల కొనసాగుతుందని, ప్రతి మూడేళ్లకు ఒక సారి బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియాకు గుర్తింపు కోసం రుసుం చెల్లిస్తున్నట్లు చెప్పారు. బీసీఐ గుర్తింపు సమస్యగా వర్సిటీలో ఉన్నత విద్యా మండలి ప్రవేశాలు నిలిపివేయటంలో బీసీఐ దృష్టికి సమస్య తీసుకు వెళ్లామని అన్నారు. బీసీఐకి గత ఏడాది నవంబర్‌లో రూ.8.50 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. ఈ నెల 3న బీసీఐ వర్చువల్‌గా సందర్శించిందని, కమిటీ సూచనల మేరకు మౌలిక వసతులు, లైబ్రరీ, మూట్ కోర్టు, బోధన సిబ్బంది వివరాలు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేశామని, బీసీఐ గుర్తింపు ధ్రువీకరణ పత్రం కోసం నిరీక్షిస్తున్నట్లు చెప్పారు. గుర్తింపు వస్తే మూడేళ్ల వరకు ఇబ్బంది ఉండదని, మూడేళ్ల తర్వాత రెన్యువల్ కమిటీ సందర్శించి చేస్తుందని తెలిపారు. గుర్తింపు వచ్చిన వెంటనే తక్షణ ప్రవేశాలు ఉన్నత విద్యా మండలి అనుమతి మేరకు నిర్వహిస్తామని చెప్పారు.

11న ఘంటసాల వర్ధంతి

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 11న సాయంత్రం 6గంటలకు ఘంటసాల వర్ధంతి మహోత్సవం బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు డాక్టర్ నిక్కు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భరతనాట్య ప్రదర్శన, కళాప్రవీణ బండారు చిట్టిబాబు సంగీత నిర్వహణలో ఘంటసాల స్వరమాధురి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వస్తారని తెలిపారు. అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

అన్నింటా ఆదర్శం



- జి.సిగడాం మోడల్ పాఠశాలలో మెరుగైన విద్య
- ప్రధానమంత్రి యశస్వీ ఉపకార వేతనాలకు పలువురి ఎంపిక
- రాష్ట్రస్థాయిలో 36 మందికి ఏడుగురు ఈ పాఠశాల విద్యార్థులే..

జి.సిగడాం: పేరుకు తగ్గట్టుగానే ఆ విద్యాలయం అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. అహ్లాదకరమైన వాతావరణం, మౌలిక సదుపాయాలు, క్రమశిక్షణతో కూడిన విద్య, కార్పొరేట్‌కు దీటైన బోధనతో అందరి అభిమానాన్ని పొందుతోంది జి.సిగడాంలోని ఆదర్శ పాఠశాల. ప్రభుత్వ లక్ష్యాలను సాధించే దిశగా సిబ్బంది నిరంతరం పని చేస్తుండడంతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు నమోదవుతున్నాయి. విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం ఇక్కడ మరింత పటిష్టంగా ఆమలు చేస్తున్నారు.

ఏడు వందల మంది విద్యార్థులు..

జి.సిగడాంలోని ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఆట, పాటలతోపాటు మెరుగై విద్యను ఉపాధ్యాయ సిబ్బంది బోధిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన ల్యాబ్ అందుబాటులో ఉంది.

ఉపకార వేతనాల్లో ప్రథమం

పీఎం యశస్వీ ఉపకార వేతనం పరీక్షల్లో రాష్ట్రస్థాయిలోనే ఈ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 36 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం–యశస్వీ) ఉపకార వేతనానికి ఎంపికైతే అందులో జి.సిగడాం మోడల్ స్కూల్ నుంచే ఏడుగురు ఉన్నారు. వీరిలో సింహాద్రి అర్చన, చదువుల తులసీ, ముల్లు భారతి, చిన్నాల మాధురి, కాకర్ల దేవిశ్రీ, మీసాల తరుణ్, ధర్మాన మేఘనాథ్ ఉండగా... వీరికి కేంద్ర ప్రభుత్వం 1.25 లక్షల రూపాయల చొప్పున డిగ్రీ చదువు పూర్తయ్యే వరకూ ఇవ్వనున్నారు. అలాగే తొమ్మిదో తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులు కూడా ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. వీరికి ఇంటర్మీడియెట్ వరకూ ఏటా రూ. 75 వేల చొప్పున ఇస్తారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తాచాటిన విద్యార్థులు

నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) టాలెంట్ పరీక్షలో కూడా ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గత విద్యా సంవత్సరంలో పది మంది ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరిలో డి.వివేక్, మక్క లహరి, ఎస్.ప్రదీప్, ఎ.సాలోమ్, జయకాంత్, పి.ఆనంద్, డి.గ్రీష్మ, బి.గాయిత్రి, వై.హేమదీపక, వి.శిరిభార్గవి, జీ.సంజీన ఉన్నారు. ఏటా కనీసం పది నుంచి 15 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక అవుతున్నారు.

బాలికలకు వృత్తి విద్యా కోర్సు

వృత్తి విద్యలో కూడా బాలికలు రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మోడల్ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశ పెట్టింది. పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి వృత్తి విద్య కోర్సుల్లో అవకాశం కల్పిస్తున్నారు. ఈ ఏడాది 80 మంది విద్యార్థినులకు వివిధ కోర్సులో శిక్షణ ఇచ్చారు. గత ఏడాది అగస్టు నెలలో 49 మంది బాలికలు తయారు చేసిన రికార్డులను ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు మంజు శర్మ, అనితసింగ్ పరిశీలించారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

వినోద కార్యక్రమాలు

మోడల్ విద్యాలయంలో దేశ, రాష్ట్ర, నాయకులు, ఉద్యమకారుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే వివిధ సేవారంగాల్లో ఉన్నవారి గురించి విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది తెలియజేస్తారు. వివిధ పండుగల సందర్భంగా విద్యార్థులతో వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంక్రాంతి, ఉగాది పర్వదినాల్లో తెలుగుదనం ఉట్టి పడేలా పిల్లలు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. రోజూ ప్రార్థన సమయంలో దేశ నాయకులు పేర్లతోపాటు వారి చేసిన త్యాగాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరిస్తారు.

ఉపకార వేతనానికి ఎంపికయ్యా..



నేను ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చదువుతున్నాను. 6 నుంచి టెన్త్ వరకూ ఇక్కడే చదివాను. పదో తరగతిలో 544 మార్కులు సాధించా. ప్రిన్సిపాల్ సూచన మేరకు పీఎం యశస్వీ ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసి.. విశాఖలో పరీక్ష రాశాను. ఉపకార వేతనానికి ఎంపిక కావడంతో ఏటా రూ. 1.25 లక్షలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది.

– సింహాద్రి అర్చన, ఇంటర్ విద్యార్థిని

క్రమశిక్షణతో కూడిన విద్య



ప్రతి విద్యార్థికి క్రమ శిక్షణతో కూడిన విద్య అందిస్తున్నాం. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా దృష్టిసారించాలి. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం.

– చిరాపు రవికుమార్, అధ్యాపకులు, మోడల్ స్కూల్

అందరి సహకారంతోనే..



అందరి సహకారంతోనే ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. ఏడుగురు ఇంటర్ విద్యార్థులు కేంద్రం అందించే ఉపకార వేతనాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ అన్నా శ్యాముల్ లంక, ప్రిన్సిపాల్

రీ సర్వేపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



వీసీలో పాల్గొన్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రీ సర్వే పనులపై తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మండల అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీఓలు, మండల ప్రత్యేక అధికారులతో రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, ధాన్యం సేకరణ, ఇ–క్రాప్ బుకింగ్, ఈకెవైసీ, నాలా, శ్మశాన వాటిక స్థలం గుర్తింపు, ఫేసియల్ రికగ్నిషన్ అటెండెన్స్, స్పందన ఫోటో అప్లోడ్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఫిబ్రవరి మాసాంతానికి 223 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 54 గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తయిందన్నారు. వచ్చే మాసానికి ఆర్ఓఆర్ పూర్తి కావాలంటే ఈ నెలాఖరు నాటికి డీఎల్ఆర్ పూర్తి కావాల్సి ఉందన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. స్టోన్ ప్లాంటేషన్ కూడా మరింత వేగవంతం కావాలన్నారు. పేదలందరికీ పట్టాలు అనే అంశంపై ఆరా తీశారు. జిల్లాలో 2365 పట్టాలు నేటికీ ప్రింటింగ్ కాలేదని గుర్తించిన జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులు పట్టాలు జనరేట్ చేసి పంపించాలని ఆదేశించారు. పంపిన వెంటనే ప్రింటింగ్‌కు చర్యలు చేపడతామన్నారు. ధాన్యం సేకరణపై మాట్లాడుతూ 93 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. దళారీల మాటలు నమ్మవద్దని రైతులను కోరారు.

రబీ ఈ–క్రాప్ బుకింగ్‌లో జిల్లా వెనుకంజలో ఉందని, దాన్ని మరింత వేగవంతం చేయాలని కోరారు. అలాగే 25 శాతం వరకు ఈకేవైసీ కాలేదని, పెండింగ్ ఉన్న రైతుల వివరాలను సచివాలయల్లో ప్రదర్శిస్తూ, ఈకేవైసీ కానిదే పిఎం కిసాన్ వర్తించబోదని తెలియజేసి, రైతులు ఈకెవైసి చేసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఉద్యోగుల శ్రేయస్సుకు సహకరిస్తా



మంత్రి ధర్మానను సత్కరిస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

- మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం రూరల్: ఉద్యోగుల శ్రేయస్సుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తమనాయుడు, పలువురు సంఘ నాయకులు శ్రీకాకుళంలోని టౌన్‌హాల్‌లో మంత్రి ధర్మానను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎనిమిదోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన పురుషోత్తమనాయుడును మంత్రి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏపీ ఎన్జీవో సంఘం ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్యన సయోధ్య కుదురుస్తూ, కఠినమైన సందర్భాల్లోనూ అటు ప్రభుత్వానికి, ఇటు ఉద్యోగుల ఉన్నతమైన ప్రయోజనాలకు కట్టుబడి సంఘాన్ని క్రమశిక్షణతో నడపడం గొప్పవిషయమన్నారు. తాను ఉద్యోగులతో స్నేహితునిగానే కొనసాగడానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. పదవులు శాశ్వతం కాదన్నారు. ఉద్యోగులు బయటి వారు కాదని ప్రభుత్వంలో భాగమన్నారు. అందువల్లనే వారికి శ్రేయోభిలాషిగానే కొనసాగుతానని, వారి శ్రేయస్సుకు ఎల్లవేళలా సహకరిస్తానని చెప్పారు. తొలుత మంత్రి ధర్మానను ఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకులు పురుషోత్తమనాయుడు, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు.

మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు రాయి వేణుగోపాల్, కంఠ జయరావు, బడగల పూర్ణచంద్రరావు, కాయల శ్రీనివాసరావు, ఆర్.గోవింద పట్నాయక్, శ్రీరాంకుమార్, కె.రోజాకుమారి, బొత్స శ్రీనివాసరావు, బారకల నవీన్, ఇప్పిలి చిట్టిబాబు, వై.అప్పలరాజు, షబీనాబేగం, తారక్ ఉన్నారు.

సీఎం జగన్ పాలనలో మహిళలకు గుర్తింపు



సదస్సులో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు మంచి గుర్తింపు వచ్చిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన మహిళా ఎమ్మెల్యేలతో విశాఖలోని ఓ హోటల్‌లో మూడు రోజులు నిర్వహించిన 'షి ఈజ్ ఏ ఛేంజ్ మేకర్ ప్రాజెక్టు – జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ ఎలెక్టెడ్ ఉమెన్ రిప్రజెంటేటివ్స్' వర్క్ షాప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సాధికారికత శిక్షణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిందన్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న సదస్సు విశాఖలో నిర్వహించడం ఉత్తరాంధ్రకు లభించిన గుర్తింపు అన్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న దిశ యాప్, అమ్మఒడి, వైఎస్సార్ అసరా, చేయూత వంటి పథకాలతో పాటు రాజకీయ పదవుల్లో 50 శాతం మహిళలకు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు.

నిప్పంటుకొని దంపతులకు గాయాలు



చికిత్స పొందుతున్న చినబాబు, సుమిత్ర

టెక్కలి రూరల్: నిప్పంటుకుని దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన గూడేం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొర్లాన చిన్నబాబు, సుమిత్ర దంపతులు. తాపీ పని చేసుకొని చినబాబు ఇంటికి చేరుకున్నాడు. ఇంతలో భార్య సుమిత్ర వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన చినబాబు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాడు. అయితే ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది చేరుకొని క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి ఎస్సై రామకృష్ణ వివరాలు సేకరించారు.

అదానీ గ్రూప్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

- డీసీసీ అధ్యక్షురాలు సత్యవతి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: అదానీ గ్రూప్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు సోమవారం శ్రీకాకుళంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందు సొమ్ము దాచుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయకరణ, ఎల్ఐసీ వంటి సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి ఆస్తులను ఆర్థికంగా దివాలా తీసే విధంగా బడా వ్యాపారవేత్తలకు వత్తాసు పలుకుతూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇటీవల అదానీ గ్రూప్స్ ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద రుణాల తీసుకుని తన వ్యాపారాల్లో వాడుకొని ఆర్థిక నేరాలకు పాల్పడుతూ వ్యాపార అవకతవకలకు పాల్పడిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

బూర్జ: సింగన్నపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో కొల్ల లింగన్నాయుడుకి చెందిన పూరిల్లు దగ్ధమైంది. మంటలను చూసిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ. 80 వేల నగదు, ఎనిమిది గ్రాముల బంగారం, ధాన్యం, బియ్యం కాలిబూడిదయ్యాయి. సుమారు రూ. రెండున్నర లక్షలు నష్టం వాటిల్లినట్టు రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా అంచనా వేశారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి సోమవారం పది కిలోల బియ్యం అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ.. కార్యకర్తల కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని, ముఖ హాజరు విధానం రద్దు చేయాలని, ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని, కోర్టు ఉత్తర్వుల మేరకు గ్రాడ్యూటీ, రిటైర్‌మెంటు సదుపాయాలు కల్పించాలని కోరారు. మినీ, మెయిన్ కేంద్రాల కార్యకర్తలకు సమాన జీతం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తేజేశ్వరరావు, రమణ, తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై గణేష్ తెలిపారు. టౌన్ హాల్ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 10.55 గంటల సమయంలో సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండే వ్యక్తి స్పృహ తప్పి పడిపోవడంతో 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో చికిత్స పొందుతూ అతను చనిపోయినట్టు చెప్పారు. మృతుని శరీరంపై తెలుపురంగు షర్టు, గడుల లుంగీ ఉన్నాయన్నారు. మూడు రోజులుగా భోజనం లేకపోవడంతోనే ఇలా జరిగిఉంటుందని వీఆర్వో బరాటం నాగేశ్వరరావు స్టేట్‌మెంట్ ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 11వ వారం పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట ప్రారంభం నుంచి చేతికి వచ్చే వరకు యాజమాన్య పద్ధతులు కీలకమని వివరించారు. విత్తనశుద్ధి నుంచి సాగు చేస్తున్న పంటకు వచ్చే చీడ పీడలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. యాజమాన్యపు ఖర్చులు తగ్గటం, కలుషితం లేని ఆహార ధాన్యాలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ధనుంజయ్, హరేరామ, రైతులు గొలివి రామకృష్ణ, శిమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి దుర్మరణం



బురిడి పెంటయ్య (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి దుర్మరణం చెందారు. 16వ నంబరు జాతీయ రహదారిపై ఫరీదుపేట పంచాయతీ పరిధి కొయ్యరాళ్ల సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో అజ్జరాం గ్రామానికి చెందిన బురిడి పెంటయ్య (57) ప్రాణాలు కోల్పోయాడు. ఎలక్ట్రికల్ స్కూటర్‌పై పెంటయ్య శ్రీకాకుళం పట్టణానికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆయన సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తాపీ మేస్త్రిగాగా జీవనం సాగిస్తున్న పెంటయ్యకు భార్య అసిరితల్లి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటికి జీవనాధారమైన వ్యక్తి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎచ్చెర్ల ఎస్సై సత్యనారాయణ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

టిడ్కో ఇళ్లు అందజేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: టిడ్కో ఇళ్లను గతంలో చలానాలు చెల్లించిన వారికి అందజేయాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందన వద్ద లబ్ధిదారులు నిరసన తెలియజేశారు. చాలా కాలంగా ఇళ్లను వాడకపోవడంతో పాడవుతున్నాయన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 26 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సివిల్, ట్రిపుల్ఈ, మెకానికల్, సీఎస్ఈ, ఈసీఈ నుంచి 138 మంది హాజరయ్యారు. వీరిలో రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా 26 మందిని వార్షిక ప్యాకేజీ రూ. 4.5 లక్షల వేతనంతో ఎంపిక చేసి లెటర్లను అందజేశారు. వీరికి సాఫ్టువేర్ ఇంజినీర్ ట్రైనర్లుగా పోస్టులు ఇవ్వనున్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణ మూర్తినాయుడు, టీపీవో ఎ.అప్పారావు అభినందించారు.